సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.25,260

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,260, కనిష్టంగా రూ.9,100, సరాసరిన రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/13.7°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి చింతపండు విక్రయాలు



హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నుంచి చింత పండు విక్రయాలకు అధికారులు చర్యలు చేపట్టారు. చింతపండు విక్రయాలకు పేరుగాంచిన హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు ఏటా లక్ష క్వింటాళ్ల సరుకు వస్తుంది. మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో ఎక్కువగా చింత పండు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అలాగే జిల్లా సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలోని రైతులు కూడా హిందూపురం మార్కెట్ యార్డుకే చింతపండును తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. నాణ్యమైన చింతపండుకు మంచి ధర పలుకుతుండటంతో రైతులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపుతారని మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

తగ్గిన మిర్చి ధర



మార్కెట్‌కు రైతులు తీసుకు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర కాస్త తగ్గింది. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 177 క్వింటాళ్ల ఎండు మిర్చి రైతులు తీసుకురాగా.. అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. అందులో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.15 వేలు, రెండో రకం రూ.13 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల చొప్పున ధర పలికాయి. గత వారంతో పోలిస్తే క్వింటాపై రూ.1500 మేర ధర తగ్గినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

రీ సర్వే సందేహాల నివృత్తికి కాల్ సెంటర్

- ప్రత్యేకంగా 9441688647 నంబర్ కేటాయింపు

ప్రశాంతి నిలయం: భూముల రీ–సర్వేలో భూయజమానులకు, సర్వే, రెవెన్యూ సిబ్బందికి వచ్చే సందేహాల నివృత్తికి కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 9441688647 నంబర్ కేటాయించినట్లు వెల్లడించారు. రీ సర్వేకు సంబంధించిన సందేహాలు, సమస్యలున్న వారు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తికి చేసుకోవచ్చన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 2,63,908 మంది లబ్ధిదారులకు శనివారం నుంచి సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం రూ.114.37 కోట్లు మంజూరు చేసిందన్నారు. రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారుల అర్హత పరిశీలన అనంతరం 721 మందిని అనర్హులుగా ప్రభుత్వం గుర్తించి, మిగిలిన వారికి పింఛన్ మంజూరు చేసినట్లు వివరించారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్షా కాలం

- నేడు 'నైతికత – మానవతా విలువలు' పరీక్ష
- ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

పుట్టపర్తి: ఇంటర్ పరీక్షల ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం జరగనున్న 'నైతికత–మానవతా విలువలు' పరీక్షతో ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలుకానున్నాయి. వరసగా ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు ఉండడంతో విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. 'నైతికత–మానవతా విలువలు' పరీక్ష అనంతరం ఈ నెల మూడో తేదీన పర్యావరణ విద్య పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత 5 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. పదో తేదీ నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తంగా 20వ తేదీ నాటికి పూర్తవుతాయి. ప్రాక్టికల్స్ రోజూ రెండు విడతలుగా జరుగుతాయి. తొలివిడత ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయి. ఇక ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 20న ముగుస్తాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయి.

భూముల ధరకు రెక్కలు

కూటమి పాలనలో బాదుడు కొనసాగుతోంది. అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే నిత్యావసరాల ధరలను భారీగా పెంచేసింది. రెండు నెలల క్రితం విద్యుత్ చార్జీల మోత మోగించింది. తాజాగా భూముల మార్కెట్ విలువను అమాంతం పెంచేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం అథఃపాతాళానికి పడిపోయింది. ఈ తరుణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 20 శాతం మేర పెరగనుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత కుదేలు కానుంది.



అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలి వచ్చిన క్రయవిక్రయదారులు

భారీగా పెంచిన కూటమి సర్కార్

- ఉమ్మడి జిల్లాలో 15 – 20 శాతం పెంపు
- పెరిగిన విలువలు నేటి నుంచి అమలులోకి
- మార్కెట్ విలువ పెంపుతో రియల్ ఎస్టేట్ మరింత కుదేల్

అనంతపురం టౌన్/హిందూపురం: భూముల మార్కెట్ విలువలు నేటి నుంచి పెరగనున్నాయి. అర్బన్ పరిధిలో 20 శాతం మేర పెంచుతూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా అనంతపురం నగరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఓ మేర జరుగుతుంది. అలాంటి ప్రాంతాల్లో 20 శాతం మేర మార్కెట్ విలువ పెరుగుతోంది. మిగిలిన ప్రాంతాల్లో 15 శాతం మేర పెరగనున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో 30 నుంచి 50 శాతం మేర పెంచుతోంది. అనంతపురం అర్బన్ పరిధిలో డోర్ నంబర్ ఆధారంగా మార్కెట్ విలువలు నిర్ణయిస్తారు. కార్పొరేషన్ పరిధిలో చదరపు గజానికి ప్రస్తుతం రూ.25 వేలకు పైగానే ఉంది. దీంతో పాటు ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలంటే చదరపు అడుగుకు రూ.1800 మేర విలువ ఉంది. ప్రస్తుతం మార్కెట్ విలువ పెంపుతో అదనంగా 20 శాతం మేర అంటే చదరపు గజానికి రూ.30 వేలతోపాటు ఇంటికి చదరపు అడుగుకు రూ.2,160 చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. వీటిని క్రయవిక్రయాలు జరిపినపుడు మొత్తం విలువలో సేల్‌డీడ్, గిఫ్ట్ డీడ్, పార్టీషన్ డీడ్‌ను బట్టి 4 శాతం నుంచి 7.5 శాతం వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక జాతీయ రహదారుల పక్కనే ఉన్న భూముల విలువలు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ కంటే 4 రెట్లు అదనంగా పెరగనున్నాయి.

నేటి నుంచి అమల్లోకి..

పెరిగిన మార్కెట్ విలువలు నేటి (శనివారం) నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. అనంతపురం జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్లు కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో పెరిగిన మార్కెట్ విలువల మేరకు నేటి నుంచి స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు అదనపు రుసుములు చెల్లించి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మార్కెట్ విలువలు పెరుగుతుండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో శుక్రవారం కిటకిటలాడాయి. ఈరోజే స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొద్ది మేర అయినా డబ్బులు మిగులుతాయనే ఆశతో భూముల కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్లు పెట్టుకున్నారు. గతంలో ఒక్కో కార్యాలయంలో రోజుకు పదికి పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగేవి. అయితే శుక్రవారం ఏకంగా ప్రతి కార్యాలయంలోనూ 50 డాక్యుమెంట్లకు పైగానే రిజిస్ట్రేషన్లు జరిగాయి.



శుక్రవారం హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద క్రయవిక్రయదారుల రద్దీ



హిందూపురం ఆఫీసులో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్

భూముల మార్కెట్ విలువ (చదరపు గజానికి)

ప్రాంతం	ప్రస్తుతం చ.గజానికి	పెరిగే విలువ చ.గజానికి
అనంతపురం అర్బన్	రూ.25,000	రూ.30,000
పాపంపేట	రూ.10,000	రూ.12,000
బుక్కరాయసముద్రం	రూ.5,000	రూ.6,000
పుట్టపర్తి	రూ.7,700	రూ. 9,240
హిందూపురం	రూ.10,000	రూ.12,000
కదిరి	రూ.6,000	రూ.7,200

పురంలో గజం రూ.3 వేల పెంపు

హిందూపురంలోని బెంగళూరు రోడ్డు, టీచర్స్ కాలనీ, మెయిన్‌బజార్, రైల్వేస్టేషన్ రోడ్డు, ముక్కిడిపేట, ఆర్‌పీజీటీ రోడ్డు... ఇలా ప్రధాన కమర్షియల్ ప్రాంతాల్లో ప్రస్తుతం గజం భూమి విలువ సుమారు రూ.23 వేలు ఉంది. తాజాగా ప్రభుత్వమే 15 శాతం పెంచడం వల్ల అక్కడ గజం సుమారు రూ.3 వేలు పెరుగుతుంది. దీంతో గజం విలువ రూ.26 వేలకు చేరనుంది. అలాగే మార్కెట్ విలువ పెరగడంతో ఎకరా రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ పెరగనుంది.

నేటి నుంచి కొత్త రేట్లు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెరిగిన స్థిరాస్తుల మార్కెట్ రేట్లు శనివారం నుంచి అందుబాటులోకి వస్తాయి. పెరిగిన మార్కెట్ విలువల నివేదికలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ అదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపాం.

– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, అనంతపురం

చార్జీల పెంపు సరికాదు



రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు నిర్ణయం సరికాదు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలి. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వల్ల సామాన్యులపై భారం పడుతుంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయింది. చిన్న, సన్నకారు రైతులకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెనుభారం అవుతాయి.

– బద్రీష్, హిందూపురం

మహిళకు విద్యుదాఘాతం





హేమావతి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం, హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాకమ్మ

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

అమరాపురం: వేలాడుతున్న కరెంటు తీగ తగిలి ఓ మహిళ విద్యుదాఘాతానికి గురైంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఘటన చోటుచేసుకుందని ఆరోపిస్తూ బాధిత కుటుంబం రైతులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించింది. వివరాల్లోకి వెళితే... కెంకర గ్రామానికి చెందిన కదిరప్ప గ్రామానికే చెందిన ఉప్పర మంజునాథ పొలాన్ని గుత్తకు తీసుకుని పంటలను సాగు చేస్తున్నాడు. శుక్రవారం పంటకు నీరు కట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో అతని భార్య సాకమ్మ టీ తీసుకుని పొలానికి వెళ్తోంది. అయితే అకస్మాత్తుగా విద్యుత్ తీగ తెగి ఆమె తలపై పడటంతో షాక్‌కు గురైంది. వెంటనే అక్కడున్న వారు 108కు సమాచారం ఇచ్చి మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు టవల్‌తో తలపాగా ధరించడంతో సాకమ్మ బతికి బయటపడిందని బంధువులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సాకమ్మ బంధువులు, రైతులు హేమావతి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని, నాణ్యమైన విద్యుత్‌ను సరాఫరా చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతుల ప్రాణాలతో ఆడుకోకుండా విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలను మరమ్మతు చేయాలని రైతులు శ్రీనివాస్, మంజునాథ్, శివన్న, నరసింహప్ప పాండు కోరారు.

విద్యార్థి కోసం ఉద్యమబాట

- 5న వైఎస్సార్ సీపీ ఫీజు పోరు
- విజయవంతానికి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపు



గోనిమేకలపల్లిలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

రొద్దం: విద్యార్థుల తరఫున వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట పట్టిందని, ఇందుకోసం 5వ తేదీ 'ఫీజు పోరు' కార్యక్రమం నిర్వహిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆ రోజున కలెక్టరేట్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఆమె రొద్దం మండల పరిధిలోని గోనిమేకలపల్లిలో 'ఫీజు పోరు' పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందిపెడుతోందన్నారు. గతంలో అమలు చేసిన జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన పథకాలకు మంగళం పాడిందన్నారు. గతంలో చంద్రబాబు దిగిపోయే నాటికి రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయి రూ 2,800 కోట్లు ఉంటే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వాటిని విడుదల చేశారన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలోనూ చంద్రబాబు రూ.140 కోట్లు బకాయి పెట్టి వెళ్లగా.. వాటినీ క్లియర్ చేసిన విషయాన్ని ఉషశ్రీచరణ్ గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఎక్కడ కూడా విమర్శలకు తావివ్వకుండా విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని మొత్తం బకాయిలు విడుదల చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3 వేల కోట్లకుపైబడి బకాయి పెట్టిందన్నారు. దీంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకూ విద్యార్థుల తరఫున పోరాటం కొనసాగిస్తామన్నారు. అంతకుముందు ఆమె గ్రామంలో పలువురు కంది రైతులు, మహిళలను కలిసి కూటమి ప్రభుత్వం పనితీరుపై ఆరాతీశారు. అమ్మ ఒడి, రైతు భరోసా కూటమి ప్రభుత్వం ఇస్తోందా? అంటూ ప్రశ్నించగా ప్రజలు ఏ పథకమూ అందడం లేదని..చంద్రబాబు మాటలు నమ్మి నష్టపోయామని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు శ్రీచరణ్‌రెడ్డి, రొద్దం, పెనుకొండ, సోమందేపల్లి, పరిగి మండలాల కన్వీనర్లు బి.తిమ్మయ్య, సుధాకర్‌రెడ్డి, గజేంద్ర, నరసింహమూర్తి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

కుదిపేస్తున్న కుష్టు



మచ్చలను పరిశీలిస్తున్న అధికారులు

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- బయటకు చెప్పకునేందుకు భయపడుతున్న వ్యాధిగ్రస్తులు
- అవగాహన లేక అనర్థాలు కొనితెచ్చుకుంటున్న వైనం
- వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం జిల్లాలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని నిపుణుల సూచన



ధర్మవరంలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరం అర్బన్: కుష్టు జిల్లాలో చాపకింద నీరులా పాకుతోంది. అవగాహన లోపం.. సమాజం వెలివేస్తుందన్న భయంతో వ్యాధిగ్రస్తులు సకాలంలో చికిత్స తీసుకోలేకపోతున్నారు. ఫలితంగా జిల్లాలో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆధునిక పద్ధతుల్లో ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తున్నా బాధితులు ముందుకు రావడం లేదు. అందువల్లే వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ఇంటంటి సర్వే చేస్తూ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. అవగాహన కల్పిస్తూ ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 309 వ్యాధిగ్రస్తులుండగా, కొత్తగా ఇంటింటి సర్వేలో మరో 94 కేసులు బయటపడ్డాయి.

చికిత్స పొందకపోతే వైకల్యం..

కుష్టు వ్యాధి 'మైకో బాక్టీరియం లెప్రే' అనే బాక్టీరియా వల్ల వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు సోకుతుంది. వ్యాధిబారిన పడిన వారి శరీరంపై ఏ భాగంలోనైనా చిన్నవి లేదా పెద్ద మచ్చలు కనిపిస్తాయి. పాలిపోయిన రాగి లేదా ఎరుపు రంగులో ఉంటాయి. ఆ మచ్చలపై స్పర్శ జ్ఞానం ఉండదు, నొప్పి తెలియదు. మచ్చలపై చెమట పట్టదు. కొన్నిసార్లు చర్మంపై బుడిపెలు ఏర్పడుతాయి. సకాలంలో చికిత్స పొందకపోతే కాళ్లు, చేతులు, పాదాల్లో నిస్సత్తువ ఏర్పడి వైకల్యానికి దారితీస్తుంది. పాదాల్లో గాయాలు ఏర్పడతాయి. నరాలు దెబ్బతినటం వల్ల కనురెప్ప పూర్తిగా మూయలేకపోతారు.

రెండు రకాలుగా చికిత్స..

కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి 5 మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి ఆరునెలల చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. 5 మచ్చలకంటే ఎక్కువ ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి 12 నెలల చికిత్స ఉంటుంది. కనీసం 18 నెలల్లో కోర్సును పూర్తి చేయాలి. కుష్టు వ్యాధిగ్రస్తులు చేతులు, పాదాలు స్పర్శజ్ఞానం లేని ప్రాంతంలో రోజూ నీటిలో అరగంట ముంచి ఉంచాలి. అలాగే చేతులు, పాదాలు పొడిగా ఉన్నప్పుడు వంట నూనె లేదా వ్యాజిలైన్ పూసుకోవాలి. పాదాలకు సురక్షితమైన పాదరక్షలు ఉపయోగించాలి. గాయాలు ఏర్పడితే క్రమం తప్పక సబ్బునీటితో శుభ్రపరుచుకోవాలి. అవసరమైనవారు కళ్ల ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఎండీటీ చికిత్సతో కుష్టు వ్యాధి దూరం..

బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. దాదాపు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అయ్యే మందులను ప్రభుత్వమే పూర్తి ఉచితంగా అందిస్తోంది. 6 నెలల నుంచి 12 నెలల వరకు ఎండీటీ చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది. అంగవైకల్యం వచ్చినవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి రూ.8 వేల ఆర్థికసాయం కూడా ప్రభుత్వం అందిస్తోంది.

కొనసాగుతున్న ఇంటింటా సర్వే..

జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జనవరి 20వ తేదీ నుంచి జిల్లాలో ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగనుంది. వైద్యులతోపాటు ఆశ కార్యకర్తలు, ఇతరత్రా సిబ్బంది మొత్తం 3,684 మంది ఇంటింటా సర్వే చేసి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు 94 కేసులను కొత్తగా గుర్తించారు. వారికి అవగాహన కల్పిస్తూ చికిత్స అందించేందుకు సిద్ధమయ్యారు.

18,76,113 జిల్లా జనాభా	4,69,028 జిల్లాలోని గృహాలు
3,684 ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది	94 ఇంటింటి సర్వేలో కొత్తగా గుర్తించిన కేసులు



309 జిల్లాలో ఇప్పటికే ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులు

రోగాన్ని దాచుకోకండి

కుష్టు సోకిన వారు సమాజానికి భయపడి రోగాన్ని దాచుకుంటున్నారు. ఇది చాలా ప్రమాదకరం. స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించండి. ప్రస్తుతం వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఎవరికైనా స్పర్శలేని మచ్చలుంటే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయండి. ఎండీటీ చికిత్సతో 6 నెలల నుంచి 12 నెలల్లోపు కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.

– డాక్టర్ జి.తిప్పయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి



వెంకటేష్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55) పాముకాటుతో మృతిచెందాడు. తన పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటకు శుక్రవారం సాయంత్రం నీరు పెడుతున్న సమయంలో పాము కాటు వేసింది. అయితే గమనించని వెంకటేష్ పొలంలో పనిచేసుకుంటూ కాసేపటి తర్వాత స్పృహ కోల్పోయాడు. గమనించిన పక్క పొలంలోని రైతులు వెంటనే ఆటోలో ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కాగా, వెంకటేష్‌కు భార్య తులసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

మునిమడుగు ఘటనలో మరికొందరికి రిమాండ్

పెనుకొండ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన మునిమడుగు ఘటనలో మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను కియా ఎస్‌ఐ రాజేష్ వెల్లడించారు. గ్రామంలో మహిళ జుట్టు కత్తిరించి, పాశవికంగా దాడి చేసిన ఘటనకు సంబంధించి ఇప్పటికే 12 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా శుక్రవారం మరో 8 మందిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రెండు రోజుల పాటు ఎన్‌సీసీ పరీక్షలు



గుడారాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక డీబీ కాలనీలో డీవీడీబీఎస్ చిన్మయ విద్యాలయలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) పరీక్షలు జరగనున్నాయి. 6వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని 20 పాఠశాలలకు చెందిన 650 మంది క్యాడెట్లకు సిద్ధాంతపరమైన, ఆచరణాత్మకమైన పరీక్షలు నిర్వహించనున్నారు. 'ఏ' సర్టిఫికెట్ జారీ కోసం నిర్వహిస్తున్న ఈ పరీక్షల పర్యవేక్షణకు బెటాలియన్ నుంచి కమాండింగ్ ఆఫీసర్, ఏఎన్‌ఓలు, సీటీఓలు హాజరుకానున్నారు. ఈ క్రమంలో విద్యాలయ క్రీడామైదానంలో క్యాడెట్ల కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన గుడారాలను, ఇతర మౌలిక వసతులను ఎన్‌సీసీ అధికారులతో కలసి విద్యాలయ ఏఎన్‌ఓలు నవీన్ కుమార్, ఎం.ప్రత్యూష లక్ష్మి పరిశీలించారు.


రైల్వే పనుల పరిశీలన

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన ప్లాట్‌ఫారంల పనులపై స్థానిక అధికారులతో ఆరా తీశారు. త్వరలో చేపట్టనున్న రెండవ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్ తదితర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

- గత ఏడాది ఆగస్టు 22న కర్ణాటక నాగేపల్లి వద్ద సందీప్ విల్లాలో నివాసం ఉంటున్న వ్యవసాయాధికారి ఇంట్లో చోరీ జరిగింది. మొత్తం రూ.25 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను దుండగులు అపహరించారు. అయితే ఈ కేసు దర్యాప్తులో ఇప్పటి వరకూ ఎలాంటి పురోగతి లేదు.
- ఈ ఏడాది జనవరి 2న పుట్టపర్తిలోని జనరల్ ఆస్పత్రికి వచ్చిన నారాయణస్వామికి చెందిన ద్విచక్రవాహనాన్ని పట్టపగలే దుండగుడు అపహరించాడు. అది కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. అంతకు ముందు సూపర్ హాస్పిటల్ దగ్గర ఓ బైక్ చోరీకి గురైంది. అయితే ఈ ఘటనపై ఇప్పటి వరకూ పోలీసులు కేసు నమోదు చేయలేదని బాధితుడు దివాకర్ తెలిపాడు.
- ఈ ఏడాది జనవరి 18న తనకల్లు మండలం మండ్లిపల్లిలో భారీ చోరీ జరిగింది. రైతు మల్లికార్జునరెడ్డి కుటుంబసభ్యులతో కలసి శ్రీశైలం వెళ్లి వచ్చే లోపు ఇంట్లో ఆగంతకులు చొరబడి రూ.3 లక్షల నగదు, 24.5 తులాల బంగారు ఆభరణాలు, 260 గ్రాముల వెండి సామగ్రిని అపహరించారు.
- ఈ ఏడాది జనవరి 29న ధర్మవరంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఉదయం 7 గంటల సమయంలో దుండగులు లాక్కెళ్లారు. అదే రోజున నల్లమాడ మండలం డి.చెర్లోపల్లిలో చిల్లర కొట్టు దుకాణం నిర్వహిస్తున్న వివాహిత మెడలోని బంగారు చైన్ ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు.
- ఈ ఏడాది జనవరి 30న కొత్తచెరువులోని రెండు చిల్లర దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. ఓ దుకాణంలో రూ.1.50 లక్షల నగదు, కొన్ని సరుకులు ఎత్తుకెళ్లారు. అదే రోజున ఓడీ చెరువులో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మూడు దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించారు.

దొంగ.. దొంగ

- జిల్లాను భయపెడుతోన్న వరుస చోరీలు
- ఆర్నెళ్లలో పెచ్చుమీరిన దొంగతనాలు
- రోజుకో చోట వెలుగు చూస్తున్న ఘటనలు
- కనిపించని రికవరీలు



జిల్లాలో దొంగతనాలు ఇలా...

ఏడాది	చోరీల సంఖ్య
2021	378
2022	466
2023	344
2024	441 (ఇందులో జూన్ తర్వాత 288)
2025	54 (30 రోజుల వ్యవధిలో)

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో దొంగలు పడ్డారు. రోజుకో చోట విభిన్న తరహాలో చోరీలు చేస్తూ జనాన్ని బెంబేలెత్తిస్తున్నారు. బైకులు, చైన్‌స్నాచింగ్‌లు, హౌస్ బ్రేక్‌లు, ఏటీఎంలు, చిల్లర దుకాణాలు.. ఇలా ఎక్కడ పడితే అక్కడ రోజూ దొంగతనాలు వెలుగు చూస్తున్నాయి. కర్ణాటక సరిహద్దున ఉన్న హిందూపురం, మడకశిర పట్టణాల్లో వరుస చోరీలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో చోటు చేసుకున్న దొంగతనాల్లో ఈ రెండు డివిజన్ల పరిధిలోనే 30 శాతం దొంగతనాలు ఉండడం గమనార్హం. పెనుకొండ, ధర్మవరం, గోరంట్ల ప్రాంతాల్లో అడపాదడపా చోరీలు జరుగుతున్నాయి. ఏ రోజున ఏ మూలన దొంగలు పడుతున్నారో అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది.

చేతులు కాలాక...

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది జిల్లా పోలీసు యంత్రాంగం తీరు. చోరీల నియంత్రణపై దృష్టి సారించాల్సిన పోలీసులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. చోరీ జరిగిన తర్వాత ఘటనాస్థలాలను పరిశీలించడం, క్లూస్ టీం, స్నిఫ్ఫర్ డాగ్‌తో సందడి చేయడం మినహా దర్యాప్తులో ఎలాంటి పురోగతి సాధించకపోవడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దొంగలు మరింత చెలరేగిపోయారు. ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తడంపైనే పోలీసులు దృష్టి సారించడం దొంగలకు కలిసొచ్చింది. దీంతో రోజుకో చోట చోరీలకు తెగబడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

జిల్లా కేంద్రంలోనే అధికం

జిల్లా వ్యాప్తంగా జరిగే దొంగతనాల్లో 30 శాతానికి పైగా చోరీలు పుట్టపర్తి డివిజన్ పరిధిలోనే చోటు చేసుకుంటుండం గమనార్హం. పుట్టపర్తి టౌన్, సూపర్ హాస్పిటల్ సర్కిల్, కొత్తచెరువు ప్రాంతాల్లో ఓ ఘటన మరిచేలోపు మరో ఘటన వెలుగు చూస్తోంది. వారం రోజుల విరామం వచ్చిందనే లోపు నల్లమాడ, ఓడీ చెరువులో దొంగతనాలు వెలుగు చూశాయి. చైన్ స్నాచింగ్‌లు, చోరీలు, బెదిరింపులు ఎక్కువ కావడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. కేవలం రాత్రి సమయంలోనే చోరీలకు పాల్పడుతున్నారనుకుంటే పొరబడినట్లే... కొన్ని ఘటనలు పట్టపగలే రద్దీ ప్రాంతాల్లో చోటు చేసుకోవడం విశేషం. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని చోరీలు సాగిస్తున్నారు. రాత్రి పూట ప్రధాన రహదారుల్లోని షాపులపై కన్నేశారు. ప్రజలు ఎంత జాగ్రత్తగా ఉన్నా.. దొంగతనాలు ఆగడం లేదు. ఇంటికి తాళం వేసి బయటికెళ్లాలంటే జనం జంకుతున్నారు.

రికవరీ అంతంత మాత్రమే..

ఏటా వందల సంఖ్యలో చోరీలు జరుగుతున్నా.. ఇందులో ఇప్పటి వరకూ పోలీసులు సాధించిన ప్రగతి మాత్రం శూన్యంగానే తెలుస్తోంది. రికవరీ రికార్డులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2022లో 38.45 శాతం, అలాగే 2023లో 23.59 శాతం, గడిచిన 2024లో 24.30 శాతం, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ రెండు శాతం మాత్రమే రికవరీ జరిగాయి. దీనిని బట్టి చూస్తే పోలీసు యంత్రాంగం ఎంత నిస్తేజంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఎవరినీ వదలం



దొంగతనాలకు పాల్పడిన ఎవరినీ వదిలేది లేదు. సీసీ కెమెరాలు చాలా చోట్ల ఉన్నాయి. ఈ ఫుటేజీల ఆధారంగా వారిని వెతికి పట్టుకుంటాం. చోరీ సొత్తు మొత్తం రికవరీ చేసి తీరుతాం. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉంటే చోరీలకు ఆస్కారం ఉండదు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరినీ నమ్మకండి. – వి.రత్న, ఎస్పీ

జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి

ఎన్పీకుంట: ప్రాథమిక పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసే జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తీసుకు వస్తున్న సంస్కరణలు ప్రాథమిక పాఠశాలలకు గొడ్డలి పెట్టుగా ఉన్నాయన్నారు. పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలోని అసంబద్ధాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 117 జీఓ వలన సమీపంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. ఈ జీఓపై ఉద్యోగ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత రావడంతో గత ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిందని గుర్తు చేశారు. విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు గతంలో ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా ఉన్నాయని మండిపడ్డారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు పేరుతో అదే విలీన ప్రక్రియ శరవేగంగా జరుగుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. విలీన ప్రక్రియ వలన పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు 1, 2 తరగతులతో కూడిన ఫౌండేషన్ పాఠశాలలుగా మారి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విద్యాహక్కు చట్టానికే విరుద్ధమన్నారు. తరగతుల తరలింపు ద్వారా ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధానాన్ని సంఘం పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పంచాయతీలో 45 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేసి 'ఎల్ఎఫ్ఎల్' ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని, ప్లస్2 పాఠశాలలను కొనసాగించి ఎస్ఏలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులుయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి
- మంత్రి నారాయణను బర్తరఫ్ చేయాలి
- విద్యార్థి సంఘాల నేతల డిమాండ్



కొత్తచెరువులో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్: ఫీజుల కోసం విద్యార్థులను వేధింపులకు గురిచేస్తూ ఆత్మహత్యలకు పురికొల్పుతున్న నారాయణ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేసి, ఆ విద్యాసంస్థ అధినేత మంత్రి నారాయణను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం శివారులోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్ ఆత్మహత్యను నిరసిస్తూ శుక్రవారం పలు విద్యార్థి సంఘాలు శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. జిల్లాలోని కదిరి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర తదితర నియోజకవర్గాల్లోని ప్రైవేటు పాఠశాలలన్నీ బంద్ పాటించాయి. కదిరి పట్టణంలోని నారాయణ పాఠశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ఉరి తాడు మెడకు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. కొత్తచెరువులోనూ విద్యార్థి సంఘాల నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని ధర్నాకు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఫీజుల వేధింపుల కారణంగానే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్ మరణించాడని, నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని వారం రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ జిల్లాలో విద్యాశాఖ అధికారులు, పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పైగా న్యాయం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు బనాయించడం చూస్తే ప్రభుత్వ యంత్రాంగం ఎవరికోసం పనిచేస్తోందో అర్థమవుతోందన్నారు. అనంతపురం నారాయణ కళాశాలలో జరిగిన ఘటనపై కనీసం విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించకపోవడం అన్యాయమన్నారు. విద్యాశాఖ మంత్రి నిజాయితీగా పనిచేస్తుంటే వెంటనే నారాయణ విద్యాసంస్థలు వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనను రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఏఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోతులయ్య, కార్యదర్శి జగదీష్, వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, పవన్‌కుమార్, విష్ణువర్ధన్, అరుణ్‌రెడ్డి, హరిప్రసాద్, గౌతమ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగలు




స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, పోలీసుల అదుపులో ఉన్న దొంగలు

రొళ్ల: రాత్రి సమయంలో ఇళ్ల ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలు అపహరించుకెళుతున్న దొంగలు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివరాలు.. .. అగళితో పాటు కర్ణాటకలోని కిత్తగళికి చెందిన వసంత, ప్రశాంత ఇద్దరూ స్నేహితులు. ఓ దోసకాయల కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరూ వసంతకు చెందిన బొలెరో వాహనంలో అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లో రైతులు విడిపించిన దోసకాయలను సేకరించేందుకు రాత్రి సమయాల్లో వెళ్లేవారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఇళ్ల ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాలను గుర్తించి, దోసకాయలను కంపెనీ వద్ద అన్‌లోడ్ చేసిన తర్వాత తిరిగి ఆయా గ్రామాలకు వెళ్లి ద్విచక్ర వాహనాలను అపహరించేవారు. ఇలా దాదాపు ఇప్పటి వరకూ నాలుగు ద్విచక్ర వాహనాలను అపహరించారు. ఈ నేపథ్యంలో తాము చోరీ చేసిన ఓ బైక్‌ను తీసుకుని రొళ్లలో తిరుగుతుండగా శుక్రవారం ఉదయం వాహన యజమాని గుర్తించి నిలదీశాడు. ఆ సమయంలో వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు అప్పగించారు. విచారణలో తాము చోరీ చేసినట్లుగా వారు అంగీకరించారు. దీంతో వారు తిరుగుతున్న బైక్‌తో పాటు అనంతరం వసంత ఇంటి వద్ద దాచిన రెండు ద్విచక్ర వాహనాలు, కర్ణాటకలోని బడవనహళ్లిలో మెకానిక్ వద్ద ఉంచిన మరో ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో రొళ్ల మండలానికి చెందినవి మూడు, గుడిబండ మండలానికి చెందిన ఓ వాహనం ఉంది. వీరి చోరీలపై పోలీసులు మరింత లోతైన విచారణ చేపట్టారు.

రేపటి నుంచి కోటంక తిరునాల

ఉత్సవాలు ఇలా...	
తేదీ	కార్యక్రమం
2	ఏకవార రుద్రాభిషకం, సహస్రనామార్చన
9	ఏకవార రుద్రాభిషేకం
15	రాత్రి 8 నుంచి 2 గంటల వరకు రథోత్సవం
16	ఉదయం 6.30 నుంచి శ్రీవారి కల్యాణోత్సవం, తిరునాల
22	గ్రామోత్సవం
23	రుద్రాభిషేకం
26	మహాశివరాత్రి విశేష పూజలు, అభిషేకాలు



కోటంక కొండలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: జిల్లా కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఈ నెల 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామికి విశిష్టమైన వారాల్లో మాత్రమే ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఉత్సవాలు నాలుగు వారాలు పాటు భక్తి,శ్రద్ధలతో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆలయ ఈఓ ఈశ్వరరెడ్డి, ప్రధాన అర్చకుడు రామాచార్యులు శుక్రవారం వెల్లడించారు. తిరునాల సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి కోటంకకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుందన్నారు.

టిప్పర్ దగ్ధం

- విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి



మంటల్లో కాలిపోతున్న టిప్పర్



సైపుల్లా (ఫైల్)

రాయదుర్గం: విద్యుత్ షాక్‌తో ఓ టిప్పర్ దగ్ధమైంది. ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం నుంచి కిందకు దూకిన డ్రైవర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు... రాయదుర్గం మండలం కదరంపల్లికి చెందిన మస్తానప్ప, జైనాబీ దంపతుల ఏకైక కుమారుడు సైపుల్లా (31) టిప్పర్ ఏర్పాటు చేసుకుని సొంతంగా డ్రైవింగ్‌కు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య భానుబీ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాడుగలో భాగంగా గురువారం సాయంత్రం లోడింగ్ కోసం డి.హీరేహాళ్ మండలం సోములాపురం రైల్వే యార్డు వద్దకు టిప్పర్‌ను తీసుకుని సైపుల్లా వెళ్లాడు. రాత్రికి అక్కడే ఉండి, శుక్రవారం ఉదయమే వాహనానికి గ్రీజ్ పెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో లిఫ్ట్ ఎత్తడంతో పైనున్న 11కేవీ విద్యుత్ లైన్‌ను తాకి ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించి మంటలు చెలరేగాయి. గమనించిన సైపుల్లా డ్రైవింగ్ సీట్‌లో నుంచి కిందకు దూకాడు. ఈ సమయంలో అనుకోకుండా వాహనం డోర్‌ను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. మంటలు ఎగిసి పడి టిప్పర్‌ను చుట్టుముట్టేయడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. అక్కడున్న వారు గమనించి సైపుల్లాను పక్కకు లాగారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న సైపుల్లాను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు డి హీరేహాళ్ ఎస్‌హెచ్‌ఓ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా... రాయదుర్గంలోని ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుడి తండ్రి మస్తానప్ప, కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చొరవ తీసుకుంటామన్నారు.

తొలగిన కన్నీటి కష్టాలు



మోటారు రిపేరు కావడంతో ఊళ్లోనే తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

ఓడీచెరువు: మండలంలోని పాలినేనివారిపల్లి వాసుల తాగునీటి కష్టాలకు తెరపడింది. పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి బోరు బావిలో మోటారు మరమ్మతుకు గురి కావడంతో మూడు నెలలుగా గ్రామస్తులకు తాగునీరు అందకుండా పోయింది. దీంతో గ్రామస్తులు పడుతున్న కష్టాలపై 'మూన్నెళ్లు.. కన్నీళ్లు' శీర్షికన గత నెల 30న 'సాక్షి'లో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. ఆగమేఘాలపై బోరుబావిలోని మోటారుకు మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.